క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తప్పవు

మహబూబాబాద్ అర్బన్/దంతాలపల్లి: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు పాఠశాల ఆవరణలో గానీ, సమీపంలో గానీ పాఠశాల పేరు మీద గాని పాఠ్య పుస్తకాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మహబూబాబాద్ ఎంఈఓ పూల్‌చంద్, దంతాపల్లి ఎంఈఓ రాము వేర్వేరు కార్యక్రమాల్లో శుక్రవారం హెచ్చరించారు. అదేవిధంగా పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేసిన, యూనిఫాం, నోట్‌బుక్స్, టై, బెల్టు బ్యాడ్జీలు తమ పాఠశాలలో కొనాలని తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేసినట్లు ఆరోపణలు వస్తే, పాఠశాలలపై ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్/మరిపెడ: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుల పోస్టులు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు శుక్రవారం తెలిపారు. అన్ని సబ్జెక్టులు బోధించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయలను తీసుకుంటామని, ఈ పోస్టులకు బీఈడీ, పీజీ చేసిన వారు అర్హులన్నారు. బాలికల గురుకులంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడునని, ఆసక్తి గల అభ్యర్థులు మహబూబాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఈనెల 29 వరకు దరఖాస్తులు అందజేయాలని 30న డెమో క్లాసులు ఉదయం 10గంటలకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఖాళీల వివరాలు తొర్రూరు, నర్సింహులపేట, ఇనుగుర్తి, మహబూబాబాద్, సబ్జెక్టులు హిందీ 1, ఇంగ్లిష్ 2, గణితం 1, సైన్స్ 2, సోషల్ 3, జువాలజీ జేఎల్ 1, పీఈటీ 2, హెల్త్ సూపర్‌వైజర్ 1, ఇంటర్మీడియట్ ఒకేషనల్, ఎంఎస్సీ హోం సైన్స్ న్యూట్రిషన్ అండ్ చైల్డ్ లైన్ కేర్ 1, ఖాళీలు ఉన్నాయన్నారు. వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

ఉద్యోగంనుంచి తొలగించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలకు ఎస్సీ విద్యార్థులను అనుమతించని ఖమ్మం జిల్లా దెందుకూరు మండలం మధిర జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నారాయణదాసుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఉద్యోగం నుంచి తొలగించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం మాట్లాడుతూ.. పాఠశాలలో ఎస్సీ విద్యార్థులు చదువుకునే అర్హత లేదని, టీసీ తీసుకొని వెళ్లాలని వారి భవిష్యత్ నాశనం చేసే విధంగా ఒత్తిడి చేస్తున్న హెచ్ఎం చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి అడిగే క్రమంలో ఎస్సీలు రావద్దంటూ బయట నిలబెట్టి అవమానపరిచాడన్నారు. ఆయనను సస్పెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ భద్రునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు చెవుల నాగార్జున, జిల్లా కార్యదర్శి మేడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.లక్ష రుణమాఫీ ఎందుకు చేయలేదు?

ఎమ్మెల్యే పర్యటనలో సమస్యల సెగ

మరిపెడ రూరల్: ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పర్యటన భాగంగా మండలంలోని ఏ గ్రామం వెళ్లిన గ్రామాల్లో సమస్యలపై సెగ తగులుతోంది. ఆయా గ్రామాల్లో పేరుకపోయిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు నుంచి పలు డిమాండ్లు, నిరసనలు వెల్లువెత్తాయి. శుక్రవారం మండలంలోని ఎలమంచిలితండా, ఆనెపురం, వెంకట్‌తండా, స్టేజితండా గ్రామాల మీదుగా 11వ రోజు డోర్నకల్ ఎమ్మెల్యే పర్యటన కొనసాగింది. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఎలమంచిలతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఇటుకలగడ్డతండాలో చేపట్టిన పర్యటనలో ఎమ్మెల్యేకు గిరిజన ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. ఓ రైతు మట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లక్ష రుణమాఫీ ఎందుకు చేయలేదని ఎమ్మెల్యేను నిలదీశాడు. దీనికి ఎమ్మెల్యే దీపావళి పండగ వరకు తప్పకుండా లక్ష రుణమాఫీ చేస్తామని సమాధానమిచ్చారు. లత అనే మహిళ మా తండా అంగన్‌వాడీ పోస్టులను మరో తండాకు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించింది. గిరిపురం శివారు ఇటుకలగడ్డతండాలో సీసీ రోడ్డు వేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారని, ఎమ్మెల్యే ఎదుట గిరిజన యువకులు, మహిళలు లొల్లి చేశారు. మా గిరిజన రైతుల భూములకు గిరిపురం గ్రామానికి చెందిన కొందరు యాదవులు పట్టా చేసుకున్నారని బాధితులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆనెపురంలో పర్యటనలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని మహిళలు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. గ్రామస్తుల కోరిక మేరకు వెంకట్ తండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 30 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, ఎంపీపీ గుగులోతు అరుణ, జడ్పీటీసీ తేజావత్ శారద, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్న, సర్పంచులు పాల్గొన్నారు. శుక్రవారంతో మరిపెడ రూరల్‌లోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే చేపట్టిన పర్యటన ముగిసింది. కాని మండలంలోని పురుషోత్తమాయగూడెంలో ఎమ్మెల్యే పర్యటన చేపట్టలేదు.



ఇటుకలగడ్డతండాలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

విద్యుదాఘాతంతో జీవాల మృతి



మరిపెడ రూరల్: సోమ్లతండాలో..



గార్లలో..

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంతో రెండు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని సోమ్లతండా గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. కథనం ప్రకారం.. మండలంలోని సోమ్లతండా గ్రామ పంచాయతీకి చెందిన రైతులు భూక్య పాప, అజ్మీర సురేష్‌లకు చెందిన రెండు ఆవులు ఉదయం గడ్డి మేయడానికి ఊరి శివారులోకి వెళ్లాయి. అక్కడ గడ్డి మేస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభాల మధ్య తెగిపడి ఉన్న లెవన్ కేవీ విద్యుత్ తీగకు ఆవులు తగిలాయి. విద్యుత్ షాక్‌కు గురికావడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన రెండు ఆవుల విలువ సుమారు రూ.1,50,000 ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

గార్ల: విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతిచెందిన సంఘటన శుక్రవారం పూమ్యాతండాలో జరిగింది. పూమ్యాతండాకు చెందిన ఖాజామియాకు చెందిన సుమారు రూ.80వేల విలువ గల పాడిగేదె మృతిచెందింది. ఉదయాన్నే మేతకు పాడిగేదెను వదలగా గ్రామంలోని 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మృతిచెందింది.



కేసముద్రం: మృతిచెందిన ఎద్దు

కేసముద్రం: మండలంలోని బేరువాడలోని ఓ వీధిలో గల విద్యుత్ స్తంభానికి ఇనుపతీగలు చుట్టి ఉండగా, అట్టి తీగలకు విద్యుత్‌తీగలు తాకడంతో విద్యుత్ సరఫరా అవుతోంది. ఈక్రమంలోతిప్పతి కుమారస్వామి అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు స్తంభానికి ఉన్న తీగలకు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు మృతితో రూ.70వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన జలగం సర్వయ్య పాడి ఆవు మేతకు వెళ్లింది. మేత మేసే క్రమంలో ప్రక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న వైరు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల దోపిడీ అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల బుక్స్ విక్రయం చేస్తున్న కేంద్రం వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వెలుగు శ్రావణ్ మాట్లడుతూ.. మానుకోట జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల దోపిడీ రోజురోజుకు తీవ్రతరమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఇరుగు వెంకటేష్, మేక వెంకటేష్, నాయకులు అశోక్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్యలేవి?

ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా అధిక ఫీజులు, పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేలోతు సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం డీఈఓకు వినతిపత్రాన్ని అందజేరు. ఈసందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నియమ నిబంధనలు విరుద్ధంగా పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ అమ్ముతున్న అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రైవేట్ పాఠశాలకు వత్తాసు పలుకుతున్న ఎంఈఓ పుల్ చంద్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా డీఈఓ రామారావు మాట్లాడుతూ.. తక్షణమే పాఠశాలపై విచారణ చేసి చర్యలు తీసుకుని, విద్యార్థులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు గుగులోత్ సూర్య ప్రకాష్, బానోత్ సింహాద్రి, జిల్లా కమిటీ సభ్యులు కడారి ప్రవీణ్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు

చేయూతనందించాలి

తొర్రూరు రూరల్: సేవా కార్యక్రమాలకు స్థానికులు చేయూతనందించాలని వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్నగౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురంలో గ్రామ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కేవులతండాలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, చికెన్‌తో కూడిన మధ్యాహ్న భోజనం అందించారు. స్థానికులకు గొడుగులు, వాటర్ క్యాన్లు, దుస్తులు, బకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. గ్రామ వాసి పుప్పాల సోమయ్య 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు ఉపేందర్ ఆర్థిక సహకారంతో వస్తువుల వితరణ కార్యక్రమం చేపట్టినట్లు యాకన్న తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మీ, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలి

డోర్నకల్: దూరప్రాంతాలలోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌లో శుక్రవారం పర్యటించిన విజయ్‌కుమార్ పాఠశాలలో చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన 50మంది పేద విద్యార్థులకు ఉచిత బస్‌పాసులను అందించారు. అనంతరం విద్యార్థులకు ఉచిత బస్‌పాసులను అందించడం, తొడేళ్లగూడెం మీదుగా అదనపు బస్సు నడపాలని నిర్ణయించడాన్ని హర్షిస్తూ ప్రిన్సిపాల్ కృష్ణభాను, ఉపాధ్యాయబృందం విజయ్‌కుమార్‌ను సన్మానించారు.

సీఐకి సన్మానం

డోర్నకల్: ఇటీవల డోర్నకల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి.ఉపేందర్‌రావును శుక్రవారం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కొలిపాక పుల్లారావు, వీరబోయిన ఉపేందర్, కొలిపాక సాయికుమార్, ముద్దం భాస్కర్, చిన్ని, సత్తి, బెల్లి సర్వయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి వీల్‌చైర్ బహూకరణ



వీల్‌చైర్‌ను అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

నెహ్రూసెంటర్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వీల్‌చైర్‌ను శుక్రవారం బహూకరించారు. ఈసందర్భంగా క్లబ్ మహబూబాద్ జిల్లా అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పలు రకాల సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భూక్య వెంకట్రాములు, రోటరీక్లబ్ కార్యదర్శి సాదు మహిపాల్‌రెడ్డి, కల్లెం వెంకట్‌రెడ్డి, వేమిశెట్టి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

డీవీ కృష్ణ ఆశయాలను కొనసాగించాలి

గంగారం/దంతాలపల్లి: విప్లవ ఉద్యమాన్ని అతి, మితవాద, అవకాశవాదాలను ఓడిస్తూ ప్రజాయుద్ధ పంథాను రూపొందించిన రూపశిల్పి కామ్రేడ్ డీవీ కృష్ణ ఆశయ సాధనను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా కొత్తగూడ, గంగారం మండలాల సంయుక్త నేత పూణెంప్రభాకర్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న అన్నారు. శుక్రవారం వారు వేర్వేరుగా మాట్లాడూతూ.. ఈనెల 22 నుంచి 26 వరకు డీవీకే సంతాప సభలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సంతాప ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈక భిక్షం, కురుసం రంగయ్య, జోగ రాములు, ఊడుగుల రాములు, సెగ్గం యాకయ్య పాల్గొన్నారు.



దంతాలపల్లి: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

చిన్నగూడూరు: వాట్సాప్, సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టింగ్‌లు పెడితే చర్యలు తప్పవని ఎస్సై సంతోష్ కుమార్ అన్నారు. సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టింగ్‌లు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని శుక్రవారం మండల కేంద్రంలో గ్రామస్తులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని నా తెలంగాణ కోటి రతనాల వీణ వాట్సాప్ గ్రూప్‌లలో ప్రభుత్వ పథకాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల గురించి, బీఆర్ఎస్ నాయకుల కులాల వారిని అవమానపరుస్తూ అభ్యంతకర పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ఇట్టి విషయమై ఎస్సై మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కొందరు పీడీఎఫ్ పాత్రికేయులు, గ్రామానికి చెందిన మరికొందరిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి 15 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇకపై సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

పెద్దవంగర: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే తగు చర్యలు ఉంటాయని ఎస్సై పిల్లల రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. వాట్సప్ అడ్మిన్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తో పాటు తదితర సోషల్ మీడియాలో ఇతరులకు ఇబ్బంది కలిగించే పోస్టులను చేపట్టితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సంబంధిత గ్రూప్ మెంబర్స్ తప్పుడు సందేశాలను చేరవేసిన, సృష్టించిన దీనికి గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

క్రైం కార్నర్..

ద్విచక్రవాహనం, ఆటో ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: ద్విచక్రవాహనం, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్పగాయాలైన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామ శివారులోగల పత్తిమిల్లు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం నల్లెల గ్రామ శివారు సూర్యతండాకు వెళ్తుంది. అందులో బానోతు సరోజ, దూదికట్ల భిక్షమాచారి, రహమాన్, మరో ఇద్దరు ఉన్నారు. మరిపెడ మండలం ఎల్లారిగూడెంకు చెందిన జినుక యుగంధర్ తన ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ వైపునకు వస్తున్నాడు. ద్విచక్రవాహనం, ఆటో బేతోలు గ్రామ శివారులో గల పత్తిమిల్లు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యుగంధర్, సరోజకు తీవ్రగాయాలు కాగా, భిక్షమాచారి, రహమాన్, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే వారందరిని 108 ద్వారా మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సరోజ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కురవి రెండవ ఎస్సై మధుబాబు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



తీవ్రగాయాలైన యుగంధర్



సరోజన

ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: ఒకరి ఆటో ఎక్కేందుకు గిరాకి రాగా సదరు కిరాయి వారిని మరో ఆటో నడిపే వ్యక్తి మాట్లాడుకున్నాడనే ఘటనలో ఇద్దరు ఆటో డ్రైవర్లకు మధ్య గొడవ జరగగా ఇద్దరిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై ఎస్.రవి శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామన్నపేట కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ తూము మల్లేష్ (తండ్రిపేరు లక్ష్మయ్య) అనే వ్యక్తి ఒక గిరాకిని మాట్లాడుకున్నాడు. ఈ క్రమంలో మరో ఆటోడ్రైవర్ తూము మల్లేష్ (తండ్రిపేరు సాయిలు) సదరు గిరాకిని అవుతలి వ్యక్తి నుంచి తాను మాట్లాడుకున్నాడు. దీంతో ఇద్దరు మల్లేష్‌ల మధ్య వాగ్వివాదంతో గొడవ జరిగింది. దీంతో తూము మల్లేష్ (తండ్రిపేరు లక్ష్మయ్య) టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తూము మల్లేష్ (తండ్రిపేరు సాయిలు) అతడి సోదరుడు వీరన్నపై కూడా కేసు నమోదు చేశారు.

దాడి ఘటనలో కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న సంఘటనలో ఒకరి ఇంటిపై మరొకరు దాడి చేయగా ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని టౌన్ ఎస్సై ఎస్.రవి శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాంతంలో నివాసం ఉండే తేజావత్ రమాదేవి (భర్త పేరు మోహన్) కుమారుడు యశ్వంత్ మూడు నెలల క్రితం బానోతు సోని అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈక్రమంలో యశ్వంత్, సోని, బానోతు చాంప్లా (సోని తండ్రి), బానోతు నర్సింహ (సోని సోదరుడు) కలిసి తేజావత్ రమాదేవి ఇంటికి వెళ్లి తమను వారి ఇంట్లోకి రానివ్వాలని అడిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని నలుగురు కలిసి తమను ఇంట్లోకి ఎందుకు రానివ్వటం లేదంటూ రమాదేవి తన ఇంట్లో ఉండగా గొడవకు దిగి దాడిచేసి గాయపరిచారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తేజావత్ రమాదేవి ఇంటి వద్ద జరిగిన సంఘటనలో ఆమె కుమారుడు తేజావత్ యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై టి.రామారావు తెలిపారు. యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తండ్రి మోహన్, తల్లి రమాదేవి, మేన మామలు బానోతు రాంబాబు, బానోతు క్రిష్టాపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తగూడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని గుంజేడు సమీపంలో శుక్రవారం జరిగింది. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఫ్రిజ్ మెకానిక్ హైదర్ హుస్సేన్ కొత్తగూడ మండలకేంద్రంలో ఫ్రిజ్ రిపేర్ చేసేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గుంజేడు గ్రామానికి చెందిన పవన్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై టాటా మ్యాజిక్ ఆటోను ఓవర్ టెక్ చేసి హైదర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు.

కాడెద్దును ఢీకొన్న ద్విచక్రవాహనం.. ఒకరి తీవ్రగాయాలు



నెల్లికుదురు: రోడ్డుపై వెళ్తున్న కాడెద్దును మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో మోటార్ సైకిల్‌పైఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ మండలం ఇస్లావత్ (ఎస్) తండాకు చెందిన ఇస్లావత్ బిక్షపతి తన సొంత పనులపై నెల్లికుదురు మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో రోడ్డుపై వెళ్తున్న కాడెద్దు ఒక్కసారిగా అడ్డు రావడంతో మోటార్ సైకిల్ కాడెద్దును ఢీకొనడంతో బిక్షపతి కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. 108లో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో ఖమ్మం ఆస్పపత్రికి తరలించినట్లు తెలిపారు.

నీలగిరి చెట్ల నరికివేత.. కేసు నమోదు

నెల్లికుదురు: అడవి సంపదను ధ్వంసం చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఎర్రబెల్లిగూడెం, చిన్ననాగారం పరిధిలోగల అడవిలో నీలగిరి (జమాయిలు) చెట్లను సొల్లతండా గ్రామ శివారు బాడ్యాతండాకు చెందిన గుగులోతు సతీష్, సురేందర్, లచ్చిరాం, జాదు, ప్రవీణ్, సంతోష్, సేవులు, మల్లేష్, బోజు, ఈరు, రవి, భూక్య మీట్యా, దేవేందర్, ఈర్యాలు నరికి అక్రమంగా సాగు చేస్తున్నట్లు తెలిపారు. వీరిపై గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మందలించామన్నారు. అయినప్పటికీ వారి పంతం మార్చుకోకుండా మళ్లీ నీలగిరి చెట్లను నరికి సాగు చేయుటకు ప్రయత్నిస్తున్నట్లు చిన్ననాగారం బీట్ ఆఫీసర్ (వనరక్షక అధికారి) బానోతు యాకూబ్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు 14మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బైండోవర్

మహబూబాబాద్ రూరల్: మానుకోట జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల ఎదుట ధర్నా చేసిన ఏఐఎస్ఎఫ్ నేతలు వెలుగు శ్రావణ్, మదగం లోకేష్, ఇరుగు వెంకటేష్, అబ్బోజు అశోక్‌లపై కేసు నమోదుచేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని టౌన్ ఎస్సై ఎస్.రవి శుక్రవారం తెలిపారు. అధిక ఫీజులు, అధిక ధరలు నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ నేతలు ధర్నా నిర్వహించిన నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండాలని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గార్ల: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీరభద్రం, సీహెచ్ గణేష్, గోళ్ల మాధవరావు, మాన్యా పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

కేసముద్రం: పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యతోపాటు, పలువురిపై పెట్టిన ఉపా కేసును ఎత్తివేయాలంటూ శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సబ్‌డివిజన్ కార్యదర్శి శ్రీధర్, అంజయ్య, మదార్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

చిన్నగూడూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మండల కోఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర అన్నారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువు దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. సర్పంచ్ పూలమ్మ, ఎంపీటీసీ ఉదయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల అందజేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని జంగిలిగొండ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ యాక సాయిలు శుక్రవారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ చామకూరి సాగర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేసముద్రం: జిల్లా కేంద్రంలో వచ్చే నెల 6న తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగసభ వాల్‌పోస్టర్లను శుక్రవారం మండల కేంద్రంలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి, ఉపేందర్, విజేందర్, వెంకన్న, ఎల్లస్వామి, మహేష్ పాల్గొన్నారు.

'పొంగులేటి'ని కలిసిన నాయకులు

కురవి: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కురవి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో కలిశారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారనే విషయం తెలిసిందే. ఈ మేరకు డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు డాక్టర్ రాంచంద్రు నాయక్, వార్డు సభ్యుడు బాలగాని శ్రీనివాస్, అంబటి వీరభద్రం, అవిరె మోహన్‌రావు, కొర్ని రవీందర్‌రెడ్డి, రఘు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బిల్లులు చెల్లించాలి

కేసముద్రం: మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం వెంటనే బిల్లులను చెల్లించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్, బుజ్జి, శిరీష పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

తొర్రూరు: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన శుక్రవారం తెలిపారు. అనంతరం సమ్మె నోటీసును కార్యాలయ ఉద్యోగికి అందించారు. రవి మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది జూలై 6 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. నాయకులు యాకయ్య, సందీప్, ప్రశాంత్, వెంకన్న, వీరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రత ముఖ్యం

పెద్దవంగర: చేతులు శుభ్రంగా చేసుకోవడం ఎంతో ముఖ్యమని హెచ్ఎం చిరంజీవి అన్నారు. శుక్రవారం మండలంలోని అవుతాపురం ప్రాథమిక పాఠశాల్లో గ్లోబల్ హ్యాండ్ వాష్ కార్యక్రమం చేపట్టారు. చేతుల పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రజిత, ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు సర్వే

దంతాలపల్లి: మండలంలోని రామవరం, ఆగపేట్, నిదానపురం, గ్రామంలో బీసీలకు లక్ష రూపాలయల ఆర్థికసాయం కోసం లబ్ధిదారుల ఎంపికకు శుక్రవారం సర్వే జరిపినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో అప్సర్ పాషా, కార్యదర్శి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలి

దంతాలపల్లి: ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ముదిరాజ్‌లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మెపా మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు నిరంజన్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఓ ప్రైవేట్ ఛానల్‌లో పనిచేస్తున్న అజయ్ ముదిరాజ్‌ను అక్రమంగా బంధించి, ముదిరాజ్‌లను బూత్ పదజాలంతో తిట్టడం అవమనించినట్లే అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

కురవి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సమావేశం దొంతు రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పోగుల శ్రీనివాస్, రాజన్న, బుర్ర సమ్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

బొడ్రాయి తిరుగువారం వేడుక

కురవి: మండల కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా శుక్రవారం తిరుగువారం వేడుకలు ఘనంగా జరిగాయి. కురవిలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు ముగిసిన 16వ రోజున బొడ్రాయి దాత బుక్కావీరన్న దంపతుల ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద ప్రత్యేకంగా హోమ పూజలు నిర్వహించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పెద్దవంగర: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు అవుతాపురం రైతు వేదికలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన 100 మంది మహిళలకు కుట్టు మిషన్లు, ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెనకదాసుల లక్ష్మీ, సల్దెండి మంజుల, వైస్ ఎంపీపీ కల్పన, ఎంపీఓ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన చెట్టు

కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస శివారు బీల్యా తండా వద్ద ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెద్ద చెట్టు కూలిపోయి రోడ్డుపై పడిపోయింది. దీంతో రాకపోకలకు గంటపాటు అంతరాయం ఏర్పడింది. అనంతరం తండావాసులు డోజర్ సహాయంతో చెట్టును రోడ్డు పక్కకు నెట్టివేశారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.